నిజం మా నైజం...!

RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com | ఎడిటర్ : చింతల రామకృష్ణ | సంపుటి: 4 | సంచిక: 342 | శనివారం, 09 మే 2026 | పేజీలు - 8 | వెల : 3/-

వాస్తవ తెలంగాణ
విలేఖరులు కావలెను
call:8499902850

• ప్రాణాలు బలిగొన్న ప్రేమ..


2

# రౌండప్ చేసి.. కత్తులతో అటాక్

## ఇంజినీరింగ్ విద్యార్థి దారుణ హత్య

- పారిపోతున్నా వెంబడించి తల, మెడపై 15 కత్తిపోట్లు
- దాడికి పాల్పడ్డ ఏడుగురు దుండగులు
- విచక్షణా రహితంగా యువకుడిపై దాడి
- అక్కడికక్కడే కుప్పకూలిన బాధితుడు యువన్
- ఘాతుకానికి ప్రేమ వ్యవహారమే కారణం
- ప్రేమికురాలి బంధుగణంపైనే అనుమానాలు

**చిలకలగూడలో అర్ధరాత్రి దారుణం**



సికింద్రాబాద్‌లోని చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ హత్య జరిగింది. ప్రేమ వ్యవహారమే కారణంగా తెలుస్తోంది.యువకుడిని విచక్షణారహితంగా కత్తులతో పొడిచి ప్రాణాలు తీశారు. ఇందిరానగర్ కాలనీలో గురువారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. అల్వాల్‌లోని యాప్రాల్‌కు చెందిన యువన్ (21), మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. యువన్ గతంలో చిలకలగూడలోని ఇందిరానగర్‌లో నివసించేవాడు.అక్కడే ఒక యువతితో ఐదేళ్లుగా ప్రేమ వ్యవహారం నడుస్తోంది. ప్రస్తుతం యాప్రాల్‌లో ఉంటున్నప్పటికీ, తరచూ ఆ యువతిని కలిసేందుకు యువన్ చిలకలగూడకు వస్తుండేవాడు. దీంతో యువతి కుటుంబీకులే వెంటాడి కత్తులతో నరికి చంపేసినట్టు అనుమానాలున్నాయి.

# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం..పలు బీసీ కులాల పేర్లు మార్పు




**హైదరాబాద్ : వాస్తవ తెలంగాణ** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బీసీ కమిషన్ సమర్పించిన సిఫార్సుల మేరకు పలు కులాల పేర్లను మారుస్తూ, మరికొన్ని కులాలకు గౌరవప్రదమైన పర్యాయపదాలను జోడిస్తూ రాష్ట్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. బీసీ జాబితాలోని గ్రూప్–ఎ , గ్రూప్–డీ విభాగాల్లో ఈ మార్పులు చేపట్టింది. ఈ క్రమంలో గ్రూప్–ఏ లోని వరుస సంఖ్య 7లో ఇప్పటి వరకు ఉన్న 'దొమ్మర' అనే పదాన్ని తొలగించి, దాని స్థానంలో 'గడ వంశీయ' అనే పేరును అధికారికంగా ఖరారు చేసింది. అలాగే, వరుస సంఖ్య 18లో ఉన్న 'పిచ్చకుంట్ల' అనే పదాన్ని మారుస్తూ, ఇకపై ఆ కులాన్ని 'వంశ రాజ్'గా వ్యవహరించాలని నిర్ణయించింది. వరుస సంఖ్య 4లో ఉన్న బుడబుక్కల కులానికి 'శివ క్షత్రియ' అనే పదాన్ని పర్యాయపదంగా చేర్చడం ద్వారా, రికార్డుల్లో వీరిని ఇకపై 'బుడబుక్కల, శివ క్షత్రియ'గా నమోదు చేయనున్నారు. అదేవిధంగా వరుస సంఖ్య 5లో ఉన్న 'వన్నార్'అనే పదాన్ని తొలగించి, ఆ స్థానంలో 'ధోబీ' అనే పదాన్ని చేర్చడం ద్వారా మొత్తంగా వీరిని 'రజక, చాకలి, ధోబీ'గా పేర్కొంటారు. వీటితో పాటు సీ గ్రూప్–డి విభాగంలో కూడా ప్రభుత్వం పలు మార్పులు చేపట్టింది. ముఖ్యంగా వరుస సంఖ్య 29లో ఉన్న 'శూద్ర కులం' అనే పదాన్ని ప్రభుత్వం రికార్డుల నుంచి పూర్తిగా తొలగించి, దాని స్థానంలో 'తమ్మలి (బ్రాహ్మణేతర)'గా పేరు మార్చింది. అలాగే వరుస సంఖ్య 5లో ఉన్న కులానికి 'మేరు' అనే పదాన్ని అదనంగా జోడించి, ఇకపై వీరిని 'మేర, మేరు, చిప్పోలు'గా గుర్తించాలని నిర్ణయించింది.

# తమిళనాడులో గవర్నర్ తీరు.. కోర్టుకు విజయ్



**హైదరాబాద్ : వాస్తవ తెలంగాణ** తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటుపై సందిగ్ధత కొనసాగుతోంది. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని టీవీకే అధ్యక్షుడు విజయ్ రెండు సార్లు విజ్ఞప్తి చేసినా.. గవర్నర్ తిరస్కరించిన విషయం తెలిసిందే. దీంతో గవర్నర్ తీరుపై విజయ్ కోర్టుకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపారు. మరోవైపు గవర్నర్ తీరును నిరసిస్తూ కాంగ్రెస్ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టింది.

# సగౌరవంగా.. పిలుద్దాం!

## పలు కులాలకు కొత్త పేర్లు


- సామాజిక సంస్కరణకు శ్రీకారం
- తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు
- 'దొమ్మర' ఇకపై 'గడ వంశీయ'గా..
- 'పిచ్చకుంట్ల' ఇకపై 'వంశ రాజ్'గా గుర్తింపు
- గౌరవప్రద నామాలతో పాత కులాలు
- బీసీ గ్రూప్–ఏ విభాగంలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు

3

# తెలంగాణలో.. మూర్ఖుల పాలన

- సంస్కృతిని అర్థం చేసుకోకుండా నిర్ణయాలు
- 800 ఏళ్ల నాటి శివాలయం కూల్చివేతపై కేటీఆర్ ఆగ్రహం
- ఆలయాన్ని పునరుద్ధరించాలని డిమాండ్

3



# ఈ నెల 20 లోపు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక



**హైదరాబాద్ : వాస్తవ తెలంగాణ** సొంత స్థలాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మించుకుంటున్న పేదలకు రూ.5 లక్షలు ఇస్తున్నామని, ఇప్పటికే 4 లక్షల ఇళ్లను మంజూరు చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. లబ్ధిదారులకు బిల్లులు సక్రమంగా, అందేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. ఎక్కడ పొరపాటు జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. గతంలో ఇల్లు మంజూరైనా పూర్తి చేసుకోలేని వారికి వెసులుబాటు కల్పించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పనులు ఏ స్థాయిలో ఉన్నా.. ఈ నెల 20లోపు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని చెప్పారు.

# 'డిండి'ని వేగంగా పూర్తి చేయండి



**హైదరాబాద్: వాస్తవ తెలంగాణ** : డిండి ఎత్తిపోతల పథకం వేగంగా పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని బీఆర్.అంబేద్కర్ సచివాలయంలో శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో కలసి ఆ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆఫ్ టెక్ పాయింట్ కు సంబంధించిన లెవల్ ఫిక్సేషన్ తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు సంబంధించిన పనుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 95 శాతం పనులు పూర్తి చేసిందని మంత్రి చెప్పారు. (మిగతా 2లో..)

# ఫ్యూచర్ సిటీ పేరుతో ఫార్మా కంపెనీలకు భూములు




**హిమాయత్ నగర్: వాస్తవ తెలంగాణ** ఫ్యూచర్ సిటీ పేరుతో భూములను ఫార్మా కంపెనీలకు కట్టబెట్టాలని చూస్తున్నారని, భూములను లాక్కోవడం అంటే అది రైతు ఆధారం, జీవితాన్ని నాశనం చేయడమేనని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ, తెలంగాణ పీపుల్స్ జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'ఫార్మా సిటీ ప్రాంతంలో ఏం జరుగుతుంది' అనే అంశంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షులు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిస్సిగ్గుగా 13,500 ఎకరాల భూమిని ఫార్మాసిటీ కోసం లాక్కుందని, నేడు ఫ్యూచర్ సిటీ కోసం 30 వేల ఎకరాలు లాక్కొనేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు.ఫార్మా సిటీలో ఎన్ని ఉద్యోగాలు ఇస్తారో స్పష్టంగా చెప్పడం లేదన్నారు. డేటా సెంటర్ల కారణంగా ఎంత పొల్యూషన్ అవుతుందో అంచనా వేయలేకపోతున్నారని, వాటి వల్ల పక్షులు కూడా బతకడం లేదని అన్నారు. రంగారెడ్డి జిల్లాలో రైతుల పట్టా భూముల జోలికి ప్రభుత్వం రావొద్దని హెచ్చరించారు. కొన్నిచోట్ల భూస్వాముల భూములను వదిలేసి, గిరిజనుల భూములు లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో రైతులకు, ఉద్యమకారులకు జరిగిన నష్టంలో తాను కూడా భాగస్వామ్యంగా ఉన్నానని, ఆ పాపాలను కడుక్కోడానికి ఇప్పుడు వారి పక్షాన కొట్లాడుతున్నానని స్పష్టం చేశారు.హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్ విస్తరణ వల్ల వ్యవసాయ భూములు కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతిని నాశనం చేస్తే భవిష్యత్‌లో ఆహార సంక్షోభం తప్పదని హెచ్చరిం చారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫార్మాసిటీ రైతులకు అండగా ఉంటామని, భూములు తిరిగి ఇస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, కానీ అధికారంలోకి వచ్చాక మాట మార్చారని విమర్శించారు. నేడు కాలుష్యం వల్ల గాలిని కొనుకొనే పరిస్థితి ఏర్పడిం దన్నారు. ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ.. పాలకులు అభివృద్ధి పేరిట రైతాంగాన్ని, రాజ్యం మధ్య వైరుధ్యం సృష్టిస్తున్నారన్నారు. పచ్చని పొలాల్లో కాలుష్య పరిశ్రమలు ఏర్పాటు చేయడంపై రైతులు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. పటాన్‌చెరు ప్రాంతంలో కాలుష్య ప్రభావాన్ని ప్రత్యక్షంగా చూస్తున్నామని అన్నారు. ప్రజా ఉద్యమాల ద్వారానే పాలకులలో మార్పు తీసుకురావాలన్నారు.ధర్మ సమాజ్ పార్టీ నేత విశారదన్ మహారాజ్, వీకేసీ పార్టీ నేత తెలంగాణ శ్యామ్, సీపీఐ నేత నరేంద్రప్రసాద్ తదితరులు మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా యాచారం, కందుకూరు మండలాల పరిధిలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొదలైన ఫార్మా సిటీ ప్రతిపాదనను, తప్పుడు పద్ధతుల్లో సాగించిన భూసేకరణను రైతులు మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. ప్రకృతిని నాశనం చేసి, డబ్బులు సంపాదించడం సరి కాదన్నారు. రైతుల ఉద్యమానికి పౌర హక్కుల సంఘం మద్దతుంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఫార్మా సిటీ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ సరస్వతి కవుల, కో–కన్వీనర్ కన్నెగంటి రవి, విస్సా కిరణ్, ఆప్ హేమ, ఉషశ్రీ, సబితా తదితరులు పాల్గొన్నారు.

# రౌండప్ చేసి.. కత్తులతో అటాక్

## ఇంజినీరింగ్ విద్యార్థి దారుణ హత్య

- పారిపోతున్నా వెంబడించి తల, మెడపై 15 కత్తిపోట్లు
- దాడికిపాల్పడ్డ ఏడుగురు దుండగులు
- విచక్షణారహితంగా యువకుడిపై దాడి
- అక్కడికక్కడే కుప్పకూలిన బాధితుడు
- ఘాతుకానికి ప్రేమ వ్యవహారమే కారణం
- ప్రేమికురాలి బంధుగణంపైనే అనుమానాలు
- చిలకలగూడలో అర్ధరాత్రి దారుణం






సికింద్రాబాద్‌లోని చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ హత్య జరిగింది. ప్రేమ వ్యవహారమే ప్రధాన కారణంగా ఒక యువకుడిని ప్రత్యర్థులు విచక్షణారహితంగా కత్తులతో పొడిచి ప్రాణాలు తీశారు. ఇందిరానగర్ కాలనీలో గురువారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. అల్వాల్‌లోని యాప్రాల్‌కు చెందిన యువన్ అలియాస్ అఖిల్ (21), మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. యువన్ గతంలో చిలకలగూడలోని ఇందిరానగర్‌లో నివసించేవాడు. అక్కడే ఒక యువతితో ఐదేళ్లుగా అతడికి ప్రేమ వ్యవహారం నడుస్తోంది. ప్రస్తుతం యాప్రాల్‌లో ఉంటున్నప్పటికీ, తరచూ ఆ యువతిని కలిసేందుకు యువన్ చిలకలగూడకు వస్తుండేవాడు.

వాస్తవ తెలంగాణ

### గొడవకు దిగి.. కత్తులతో దాడి

యువన్ తన మిత్రులతో కలిసి గురువారం రాత్రి 9 గంటల సమయంలో ఇందిరానగర్‌లో మొబైల్ ఫోన్‌లో క్రికెట్ మ్యాచ్ చూస్తున్నాడు. ఆ సమయంలో రెండు ద్విచక్ర వాహనాలపై సుమారు ఏడుగురు యువకులు అక్కడికి చేరుకున్నారు. వారు యువన్‌తో గొడవకు దిగి, ఒక్కసారిగా వెంట తెచ్చుకున్న కత్తులతో అతడిపై విచక్షణారహితంగా దాడి చేశారు. నిందితులు యువన్‌ను వెంటాడి మరీ దాడికి పాల్పడ్డారు. తల, మెడ, చేతులపై సుమారు 15 చోట్ల కత్తులతో పొడవడంతో యువన్ రక్తపు మడుగులో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. నిందితుల్లో సదరు యువతి సోదరులు, వారి స్నేహితులు ఉన్నట్లు సమాచారం. తమ సోదరితో యువన్ ప్రేమలో ఉండటం ఇష్టం లేని వారు, పక్కా పథకం ప్రకారమే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు.

### పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు?

సమాచారం అందుకున్న చిలకలగూడ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. యువన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ హత్యకు పాల్పడిన నిందితులను పట్టుకునేందుకు పోలీసు లు మూడు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ప్రాథమిక దర్యాప్తులో భాగంగా పరమేష్, వంశీ అనే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే, ఈ హత్యలో మరికొంతమంది ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం పరారీలో ఉన్న మిగతా నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

### ఉద్రిక్తంగా నామాలగుండు ప్రాంతం

హత్య వార్త తెలియగానే మృతుడి బంధువులు, స్నేహితులు పెద్ద ఎత్తున నామాలగుండు ప్రాంతానికి చేరుకున్నారు. ఆగ్రహంతో ఊగిపోయిన బంధువులు నిందితుల ఇళ్లను ముట్టడించే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మృతుడి పెద్దమ్మ ఇంటి వద్ద స్నేహితులు భారీగా గుమిగూడటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా , శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు ఆ ప్రాంతంలో భారీగా మోహరించారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు. ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని చిలకలగూడ పోలీసులు తెలిపారు.

## 'డిండి'ని వేగంగా పూర్తి చేయండి

(మొదటి పేజీ తరువాయి)

అయితే మూడు గ్రామాల పునరావాస సమస్యలు, నల్లగొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 180.14 హెక్టార్ల అటవీ భూమికి సంబంధించిన సమస్యల కారణంగా స్పిల్‌వేలో ఒక భాగం ఇంకా పూర్తి కాలేదన్నారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు గేట్ల ఏర్పాటు కోసం వెంటనే టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. అలాగే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ఎదుళ్ల రిజర్వాయర్ నుండి ఎత్తిపోతల స్కీం అప్రోచ్ ఛానల్ కు నీటిని ఏ స్థాయిలో తీసుకు రావాలనే అంశంపై తుదినిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోతిరెడ్డిపల్లిలో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ బ్యారేజ్ పనులను మే 15 నాటికి ఆర్థిక సంబంధిత అనుమతులు తీసుకుని వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. ఏఎంఆర్పీ ఎస్ఎల్‌బీసీ ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 2400 క్యూసెక్కుల నుంచి 4000 క్యూసెక్కులకు పెంచాలని సూచించారు. ఎస్ఎల్‌బీసీ హై లెవల్ కాలువకు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనుల కోసం ప్రభుత్వం రూ.443 కోట్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. పెండ్లిపాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పూర్తి చేసేందుకు సవరించిన అంచనాల తయారు చేసి హై పవర్ కమిటీ ముందు ఉంచేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. సమీక్షలో రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్, జాయింట్ సెక్రటరీ కే. శ్రీనివాస్, ఈఎన్ సీ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు భూమి పూజలో పాల్గొన్న ఎఎంసీ చైర్మన్ సుధాకర్ రెడ్డి



**మునిపల్లి వాస్తవ తెలంగాణ న్యూస్** రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ ఆదేశానుసారం సంగారెడ్డి జిల్లా, మునిపల్లి మండలం లోని ఇబ్రహీంపూర్ గ్రామంలో నాలుగు ఇందిరమ్మ ఇల్లు భూమి పూజ ముఖ్య అతిథులుగా విచ్చేసి, పనులు ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్ సుధాకర్ రెడ్డి. ఇందులో పాల్గొన్న మాజీ ఎంపీపీ రాంరెడ్డి, ఎంపీడీఓ చంద్రయ్య, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్ మరియు కరీం, ఇబ్రహీంపూర్ సర్పంచ్ ల్యాగాల అశోక్, ఉపసర్పంచ్ మొహియుద్దీన్, గ్రామ శాఖ అధ్యక్షుడు షేక్ అలీ, యూత్ అధ్యక్షులు ప్రేమ్ వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## కొర్లకుంట శ్రీ చిత్తారమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం- సిజిఆర్‌కు ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు



**జిన్నారం వాస్తవ తెలంగాణ న్యూస్** జిన్నారం మున్సిపల్ పరిధిలోని కొర్లకుంట గ్రామంలో శ్రీ చిత్తారమ్మ దేవి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా దేవాలయనికి తన వంతు సహాయంగా రూ.51,000 విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చిత్తరమ్మ గుడి విగ్రహ ప్రతిష్ఠపనలో పాల్గొన్న పటాన్ చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి



**జిన్నారం వాస్తవ తెలంగాణ న్యూస్** పటాన్ చెరు నియోజకవర్గం జిన్నారం మునిసిపల్ పరిధిలోని కోర్లకుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన చిత్తరమ్మ గుడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పటాన్ చెరు నియోజకవర్గ బి.ఆర్.ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు జిన్నారం వెంకటేష్ గౌడ్ , పటాన్ చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ , జిన్నారం మునిసిపల్ చైర్మన్ జనార్ధన్ , మండల అధ్యక్షుడు రాజేష్ , కౌన్సిలర్లు, బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**జిన్నారంవాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం జిన్నారం మున్సిపల్ పరిధిలోని కొర్లకుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ చిత్తారమ్మ దేవాలయంలో శుక్రవారం నిర్వహించిన అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన పటాన్ చెరుశాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి . అమ్మవారి కృపతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

# సగౌరవంగా.. పిలుద్దాం!

## పలు కులాలకు కొత్త పేర్లు

- సామాజిక సంస్కరణకు శ్రీకారం
- తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు
- 'దొమ్మర' ఇకపై 'గడ వంశీయ'గా..
- 'పిచ్చకుంట్ల' ఇకపై 'వంశ రాజ్'గా గుర్తింపు
- గౌరవప్రద నామాలతో పాత కులాలు




**వాస్తవ తెలంగాణ** తెలంగాణలోని వెనుకబడిన తరగతుల (బీసీ) చిరకాల వాంఛను నెరవేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలకమైన సామాజిక సంస్కరణకు శ్రీకారం చుట్టింది. బీసీ కమిషన్ సమర్పించిన నివేదికను క్షుణ్ణంగా పరిశీలించిన రాష్ట్ర కేబినెట్, జాబితాలోని కొన్ని కులాల పేర్లను మారుస్తూ మరికొన్నింటికి గౌరవప్రదమైన పర్యాయ పదాలను జోడిస్తూ ఆమోద ముద్ర వేసింది. ముఖ్యంగా సమాజంలో పిలిచేందుకు అసభ్యకరంగా లేదా కించపరిచే విధంగా ఉన్న పదాలను రికార్డుల నుంచి తొలగించి, ఆయా వర్గాల ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా కొత్త పేర్లను ఖరారు చేసింది. ఈ మార్పులు తక్షణమే రాష్ట్ర గెజిట్ నోటిఫికేషన్ ద్వారా అధికారిక రికార్డుల్లో అమల్లోకి రానున్నాయి.

### విప్లవాత్మక మార్పులు

బీసీ గ్రూప్ఏ విభాగంలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు చేపట్టింది. ఇందులో భాగంగా వరుస సంఖ్య 7లో ఉన్న 'దొమ్మర' అనే పదాన్ని తొలగించి, దాని స్థానంలో 'గడ వంశీయ' అనే పేరును ఖరారు చేసింది. అలాగే వరుస సంఖ్య 18లో ఉన్న 'పిచ్చకుంట్ల' అనే పదాన్ని మారుస్తూ, ఇకపై వారిని 'వంశ రాజ్'గా వ్యవహరించాలని నిర్ణయించింది. వీటితో పాటు బుడబుక్కల కులానికి 'శివ క్షత్రియ' అనే పదాన్ని, వీరభద్రీయ కులానికి వారి కోరిక మేరకు 'వీరముష్టి, నెట్టి కోటల' అనే పదాలను పర్యాయపదాలుగా జోడించింది. వన్నార్ అనే పదాన్ని తొలగించి, దాని స్థానంలో 'ధోబీ' అనే పదాన్ని చేర్చడం ద్వారా రజక, చాకలి వర్గాలకు మరింత స్పష్టమైన గుర్తింపును కల్పించింది.అదేవిధంగా బీసీ గ్రూప్డి విభాగంలో కూడా ప్రభుత్వం సామాజిక స్పృహతో పలు మార్పులు చేసింది. ముఖ్యంగా ఎప్పటి నుంచో వివాదాస్పదంగా ఉన్న 'శూద్ర కులం' అనే పదాన్ని రికార్డుల నుంచి పూర్తిగా తొలగించి, ఆ స్థానంలో 'తమ్మలి (బ్రాహ్మణేతర)'గా పేరు మార్చింది. దీనివల్ల ఆ వర్గానికి ఒక స్పష్టమైన సామాజిక గుర్తింపు లభిస్తుంది. అలాగే వరుస సంఖ్య 5లో ఉన్న 'మేర', 'చిప్పోలు' కులాలకు 'మేరు' అనే పదాన్ని అదనంగా చేర్చింది. ఈ మార్పుల వల్ల విద్యార్థులు, ఉద్యోగార్థులు తమ కుల ధ్రువీకరణ పత్రాల్లో గౌరవప్రదమైన పేర్లను పొందే అవకాశం ఉంటుంది, ఇది వారి ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంపొందిస్తుందని బీసీ కమిషన్ అభిప్రాయపడింది.

# అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి-జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి వాస్తవ తెలంగాణ న్యూస్** అకాల వర్షాల నేపథ్యంలో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు.రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ జోగిపేట మార్కెట్ యార్డుతో పాటు చౌటుకూరు మండలం కొర్పోల్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా కేంద్రాల్లో రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు, హమాలీలు, లారీలు, టార్పాలిన్ కవర్లు, గోనె సంచుల లభ్యత, ట్యాబ్ ఎంట్రీలు, ట్రక్ షీట్ల జనరేషన్, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలు, రైతుల ఖాతాల్లో జమ చేసిన చెల్లింపుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు తీసుకువచ్చే ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని, అవసరమైన మేరకు హమాలీలు, లారీలు సమకూర్చాలని ఆదేశించారు.అకాల వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించాలని స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలో మొత్తం 233 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులు 48 గంటల్లోగా రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డీఎం అంబదాస్, డీఆర్డీవో పీడీ జ్యోతి, డీసీఓ కిరణ్ కుమార్, వ్యవసాయ శాఖ ఏడీ ప్రసాద్, తహసీల్దారులు, కొనుగోలు కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# పెద్దమ్మ తల్లి ఆశీస్సులు ప్రజల పై మీద ఉండాలి :-నీలం చందు ముదిరాజ్



**పటాన్ చెరు వాస్తవ తెలంగాణ న్యూస్** పటాన్ చెరు నియోజకవర్గం గుమ్మడిదల మండల్ కనుకుంటా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన పెద్దమ్మ గుడి విగ్రహ ప్రశిష్ఠ కార్యక్రమనికి మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ నీలం మధు ముదిరాజ్ తనయుడు నీలం చందు ముదిరాజు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రజలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిరుపేదలకు ఆపన్నహస్తం ముఖ్యమంత్రి సహాయ నిధి



**పటాన్ చెరు వాస్తవ తెలంగాణ న్యూస్** ఆపత్కాల సమయంలో నిరుపేదలకు ఆపన్న హస్తం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.రామచంద్రాపురం ఎస్ ఎన్ కాలనీకి చెందిన నగారిగారి మరియమ్మ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో మెరుగైన చికిత్స కోసం ఎమ్మెల్యే జిఎంఆర్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కి దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుండి మంజూరైన ఒక లక్ష 50 వేల రూపాయల విలువైన ఎల్ఓసి పత్రాలను శుక్రవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా అందచేశారు. ఈ కార్యక్రమంలో రామేశ్వరంబండ కౌన్సిలర్ అంతి రెడ్డి పాల్గొన్నారు.

# కోర్పోలు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆకస్మికంగా తనిఖీ





**చౌటకూర్//వాస్తవ తెలంగాణ న్యూస్ కృష్ణ కాంత్ ప్రతినిధి మే 08** సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం పరిధిలోని సరాఫ్పల్లికి కలెక్టర్ వస్తున్నారన్న విషయం తెలుసుకున్న రైతులు కలెక్టర్ను కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో వరి ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయని, రోజుల తరబడి ధాన్యం రాశులు అలాగే ఉండిపోయాయని చెప్పడంతో సరాఫ్పల్లి నుండి కలెక్టర్ కోర్పోలు గ్రామానికి వెళ్లారు. డీసీఎంస్ అధ్వర్యంలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రంలో సమయానికి తూకం వేయడం లేదంటూ రైతులు కలెక్టరు పిర్యాదు చేశారు. 14 మంది హమాలీలు ఉన్నారని, హమాలీల కొరత కారణంగా కొనుగోళ్లలో జాప్యం జరుగుతుందంటూ నిర్వహకులు వివరించారు. గ్రామంలో యాసంగి వరి ధాన్యం గణనీయంగా సాగు చేశారని, మరో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. రాత్రిం భవళ్లు తూకం చేసిన ధాన్యం అలాగే ఉండిపోతుందని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా, మరో 14 మ ది హమాలీలను సమకూర్చి వెంట వెంటనే తూకం చేయాలని నిర్వహకులను కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. రెవెన్యూ, వ్యవసాయ. పౌర సరఫరాల శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించి రైతులకు నష్టం వాటిల్లకుండా ఎప్పటికప్పుడూ చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట సర్పంచ్ బుచ్చుగూడెం సునీత ప్రవీణ్ రెడ్డి, ఉప సర్పంచ్ ప్రవీణ్ తదితరులున్నారు.



## మెదక్ కలెక్టరేట్ వద్ద రైతుల నిరసన



**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి ఆంజనేయులు** మెదక్ జిల్లా కలెక్టరేట్ వద్ద ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ రైతులు, సర్పంచులు భారీ ధర్నాకు దిగారు.కలెక్టరేట్ ముందు ధాన్యాన్ని గుమ్మరించి ఆందోళన చేపట్టిన రైతులు కలెక్టర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.రెండు నెలలు కావస్తున్నా కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించ డంలో తీవ్ర ఆలస్యం జరుగుతోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి వెంటనే లారీలను పంపించి ధాన్యాన్ని తరలించాలని డిమాండ్ చేశారు.ధాన్యం తరలింపులో జాప్యానికి నిరసనగా రాయి న్ పల్లి ఈగ రాజు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా యత్నానికి యత్నించగా అక్కడున్న వారు అడ్డుకు న్నారు.కొన్ని కొనుగోలు కేంద్రాలు ఇప్పటికీ ప్రారంభం కాలేదని,మిల్లర్ల వద్దకు వెళ్లిన లారీలు నాలుగు రోజులుగా తిరిగి రాకపోవడంతో ధాన్యం కేంద్రాల వద్దే తూకం చేసిన వడ్లు నిలిచి పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ధర్నాలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు,పెద్ద ఎత్తున పాల్గొన్నారు.సమాచారం అందుకున్న అదనపు కలెక్టర్ నగేష్ రైతుల వద్దకు వచ్చి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా మేం చూసు కుంటామని రైతులకు ధీమా వ్యక్తం చేయడంతో రైతులు, సర్పంచులు ఆందోళన విరమించుకున్నారు.

## మహిళల ఉపాధి అవకాశాలతో మహిళా సంఘాల అభివృద్ధి.. ఘాట్కేసర్ సర్కిల్ డిసి వాణి రెడ్డి..





**ఘాట్కేసర్ సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ సర్కిల్ – 06 పరిధిలోని నాగారం డివిజన్ – 05 లో గల ఎస్ఎల్ఎఫ్– 07 వద్ద ఏర్పాటు చేసిన రోలింగ్ మరియు పాలిషింగ్ సెంటర్ను డిప్యూటీ కమిషనర్ ఏ. వాణి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో యు సి డి ప్రాజెక్ట్ ఆఫీసర్ కె. సురేష్ పాల్గొన్నారు. మహిళా సంఘాల అభివృద్ధి మరియు స్వయం ఉపాధి అవకాశాల పెంపు దిశగా ఈ కేంద్రం ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది మరియు మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఈనెల 11న మెదక్ ప్రభుత్వ ఐటిఐ లో ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ షిప్ మేళా ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ జి. శ్రీనివాసులు

**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి ఆంజనేయులు** మెదక్ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల11న 'ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్షిప్ మేళా' మెదక్,పట్టణంలోని ప్రభుత్వ ఐ.టి.ఐ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 11.05.2026 (సోమవారం) నాడు "ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్షిప్ మేళా" నిర్వహించబడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ కన్వీనర్ గుమ్మకొండ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు.?ఈ మేళాలో మెదక్ జిల్లాతో పాటు హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుండి పలు ప్రముఖ పరిశ్రమలు,కంపెనీ లు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నాయి. కావున మెదక్ పట్టణంలోని జిల్లావ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతీ యువకు లు,ఐటీఐ ఉత్తీర్ణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



## ఏఐసిసి ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశాల అనుసరం పదవులు ఇవ్వాలి.. వజ్రష్ యాదవ్

**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కాప్ర మండలం చర్లపల్లి డివిజన్ అధ్యక్షా పదవి రసభసగా మారింది, ఒక వైపు సీనియర్లు ఇంకో వైపు కొత్తగా పార్టీకి మారిన వారికీ తమ అనుచరా వర్గానికి పదవులు కట్టపెట్టే విధంగా స్థానిక మాజీ కార్పొరేటర్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.ఇంకో వైపు పార్టీ సీనియర్ నేతలు దానిని వెతిరేకిస్తూ మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి వర్గానికి పదవులు ఇవ్వడం వెతిరేకిస్తునారు, ఏ ఐ సి సి ఇంచార్జి మీనాక్షి నటరాజన్ మరియు టి పి సి సి అధ్యక్షులు మహేష్ గౌడ్ ఇచ్చిన అదేహలమేరకు 3 సంవత్సరాలు పై బడి ఉన్న కార్యకర్తలకే ఉన్నత పదవులు ఇవ్వాలని కోరగా చెర్లపల్లి డివిజన్ లో అది అమలు అవ్వడం లేడు మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి వర్గానికే పదవులు ఇవ్వడం కనీసం పార్టీలో ఉన్న సీనియర్ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వకావడం సిగ్గు చేటు, కావున ఈరోజు స్థానిక జిల్లా అధ్యక్షులు తోటకూర వజ్రష్ యాదవ్ ని చర్లపల్లి డివిజన్ సీనియర్ కాంగ్రెస్ కార్యకర్తలు వెళ్లి వారి యొక్క ఆవేదన వెక్తం పరచడం తో పార్టీ ఇచ్చిన ఆదేశాలమేరకే సీనియర్ నాయకులకు ఉన్నత పదవులు ఇవ్వడం జరుగుతుంది అని వారు హామీ ఇవ్వడం జరిగింది. కష్ట పడ్డ వారిని కాంగ్రెస్ పార్టీ గుర్తించి వారికీ పార్టీ ఎల్లపుడు అండగా ఉంటుంది అని మేడ్చల్ జిల్లా అధ్యక్షులు తోటకూర వజ్రష్ యాదవ్ చర్లపల్లి సీనియర్ నేతల తో చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమం లో గడ్డం యాదగిరి,బూడిద శ్రావణ్ కుమార్ గౌడ్, మన్మోహన్ రెడ్డీ, పుల్లపు మల్లేష్, ప్రేమ్ కుమార్ గౌడ్,వంశీ రాజ్, కె వి ఎల్ ఎన్ రావు, లతీఫ్, సర్ఫారాజ్, రాములు తదితరులు పాల్గొన్నారు.



## గుమ్మడిదలలో ఉచిత రొమ్ము క్యాన్సర్ పరీక్ష శిబిరం

– మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ చేతుల మీదుగా ప్రారంభం



**గుమ్మడిదల వాస్తవ తెలంగాణ న్యూస్** గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో ఏఐజి హాస్పిటల్, తెలంగాణ ప్రభుత్వం మరియు గ్రాన్యూల్స్ కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత రొమ్ము క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని మండల వైద్యాధికారి డాక్టర్ ఎస్ మధుకర్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ , వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యా రెడ్డి ప్రారంభించారు. ఈ ఈ సందర్భంగా చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్య రక్షణ కోసం ఇలాంటి శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. మొత్తం 70 మంది మహిళలకు పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించామని, వీటి నివేదికలు మూడు రోజుల్లో అందజేస్తామని ఆయన వివరించారు. ఇదే తరహాలో మే 12న అన్నారం వార్డు ఆఫీసులో కూడా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రాన్యూల్స్ ప్రతినిధి డాక్టర్ ప్రజ్ఞ చిగురుపాటి, కౌన్సిలర్లు నరేందర్ రెడ్డి, మురళి, రమేష్, మహేష్, చక్రపాణి, పద్మ, తుపాకుల రాధికా రాజు, కిషన్, ఆకుల మాధవి, పొన్నాల ప్రమీల, హెచ్ఈఓ శ్రీనివాస్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఉప్పల్ ఎమ్మెల్యేను నిలదీసిన హైడ్రా కమిషనర్

## కాప్రా కాంగ్రెస్ నేతల ఫిర్యాదుపై స్పందించిన కమిషనర్





**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కాప్ర మండలం ఏ అధికారంతోని కాప్రా చెరువులో భూమి పూజా చేద్దామను కున్నారు..?? ప్రోటోకాల్ గురించి మీకు తెలియదా.? అంటూ ఉప్పల్ ఎమ్మెల్యేపై హైడ్రా కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల విషయంలో మంత్రులు, జిల్లా మంత్రులు ఉంటారని మీకు తెలుసు కదా. వారిని ఎవరినీ కూడా కాదని మీరే ఎలా భూమి పూజా చేద్దామనుకున్నారంటూ ఎమ్మెల్యేను హైడ్రా కమిషనర్ నిలదీశారు.కాప్రా చెరువు అభివృద్ధికి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి రూ.35 కోట్ల నిధులను మంజూరు చేయించారు. త్వరలోనే జిల్లా ఇంఛార్జీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా భూమి పూజ చేసి పనులను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చెరువులో అభివృద్ధి పనులకు తానే భూమి పూజ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న కాప్రా కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హైడ్రా కమిషనర్ రంగనాధ్‌ను కలిసి ఇదే విషయం చెప్పారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని వెంటనే ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి ఫోన్ చేసి పై విధంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ ప్రకారమే భూమిపూజ జరుగుతుందని కాప్రా కాంగ్రెస్ నేతలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొబ్బనూరి నాగశేషు ,మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, మాజీ కౌన్సిలర్ రాజేందర్,జిల్లా మాజీ ఏ ఎం సి కొబ్బనూరి నాగరాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పడమటి మల్లారెడ్డి,పొట్టు బాబురావు, జి సత్యనారాయణ, తన్నీరు శ్రీహరి, తోటకూర శ్రీకాంత్,గుణశేఖర్,రాజశీలన్... పాల్గొన్నారు.

# పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత

## పశుసంరక్షణతో రైతులకు అదనపు ఆదాయం కలెక్టర్ ప్రతీక్ జైన్







**చౌటకూర్//వాస్తవ తెలంగాణ న్యూస్ కృష్ణ కాంత్ ప్రతినిధి మే 08**సమగ్ర పశు సేవలు -- పశు చికిత్స మరియు అవగాహన శిబిరంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్పాడి పరిశ్రమ రైతులకు స్థిరమైన అదనపు ఆదాయ వనరుగా మారాలని ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చౌటుకూరు మండలం సరాఫ్‌పల్లి గ్రామంలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ మరియు పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమగ్ర పశు సేవలు, పశు చికిత్స మరియు అవగాహన శిబిరంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో పశుసంపద అధికంగా ఉండటం ఆనందంగా ఉందని, పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచడంలో పశుసంపద కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.పశువుల ఆరోగ్య పరిరక్షణ, డివార్మింగ్, టీకాలు, పశుగ్రాస నిర్వహణ, సంతానోత్పత్తి సేవలు, పాల ఉత్పత్తి పెంపు వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఇటువంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరమని కలెక్టర్ తెలిపారు. పశుసంవర్ధక శాఖ అధికారులు గ్రామస్థాయిలో రైతులకు మరింత చేరువై సేవలు అందించాలని సూచించారు.పశువుల చికిత్సలు, శస్త్రచికిత్సల కోసం అవసరమైన టేబుళ్లు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరగా, సంబంధిత అంశంపై తగిన చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారి వసంత కుమారిని కలెక్టర్ ఆదేశించారు.ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌తో పాటు రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజలు తమ సమస్యలను అక్కడ తెలియజేసి పరిష్కారం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా పలువురు రైతులకు సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేశారు. శిబిరంలో పశువులకు డివార్మింగ్ మందులు వేయడంతో పాటు పశు సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వసంత కుమారి, జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్, గ్రామ సర్పంచ్, తహసిల్దార్, రైతులు, పాడి రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.






# ఐపీఎల్‌తో.. హరితహారం

ప్రపంచ క్రికెట్ పటంలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) అంటేనే కాసుల వర్షం, గ్లామర్, హోరాహోరీ పోరుకు మారుపేరు. వేల కోట్ల రూపాయల టర్నోవర్, ప్రపంచ స్థాయి స్టార్ ఆటగాళ్లు, కార్పొరేట్ దిగ్గజాల స్పాన్సర్‌షిప్‌లతో ఐపీఎల్ ఒక పక్కా వ్యాపార క్రీడగా కనిపిస్తుంది. అయితే ఈ భారీ వినోద ప్రవాహం వెనక ఒక నిశ్శబ్ద పచ్చని విప్లవం కొనసాగుతోంది. కేవలం సిక్సర్లు, ఫోర్ల కోసమే కాకుండా, పర్యావరణ పరిరక్షణ కోసం బీసీసీఐ తీసుకున్న 'హరిత సంకల్పం' ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది.

వాస్తవ తెలంగాణ

## ప్రతి డాట్ బాల్‌కు వంద మొక్కలు !

- పర్యావరణ హితం కోసం టాటా గ్రూప్ సంకల్పం
- బౌలర్ వేసే డాట్ బాల్ ప్రకృతి మాతకు ఊపిరి
- గత ఏడాది ఆరు లక్షల మొక్కలు నాటిన సంస్థ
- ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్న'హరిత సంకల్పం



### డాట్ బాల్‌కు కొత్త అర్థం.. కొత్త ఆయుష్షు !

సాధారణంగా టీ20 క్రికెట్‌లో బ్యాటర్లు ప్రతి బంతినీ బౌండరీకి తరలించాలని చూస్తుంటారు. అలాంటి ఉత్కంఠభరిత పోరులో బౌలర్ పరుగు ఇవ్వకుండా బంతిని వేయడం (డాట్ బాల్) అనేది ఒక గొప్ప విజయంగా పరిగణించబడుతుంది. ఈ డాట్ బాల్‌కు గణాంకాల పరంగానే కాకుండా సామాజికంగా కూడా ఒక ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని బీసీసీఐ నిర్ణయించుకుంది. 2023 ఐపీఎల్ ప్లేఆఫ్స్ దశలో ప్రయోగాత్మకంగా ప్రారంభమైన ఈ 'గ్రీన్ ఇనిషియేటివ్' ఇప్పుడు ఒక బృహత్తర కార్యక్రమంగా రూపాంతరం చెందింది.

### డాట్ బాల్ పర్యావరణానికి వరం

లక్షల మొక్కల హరిత ప్రయాణం టాటా గ్రూప్ సహకారంతో సాగుతున్న ఈ ప్రాజెక్టులో గణాంకాలు విస్మయం కలిగిస్తున్నాయి. 2023 ప్లేఆఫ్స్‌లో ప్రతి డాట్ బాల్‌కు 500 మొక్కలు నాటేలా ఒప్పందం చేసుకున్నారు. ఈ సీజన్‌లో పడే ప్రతి డాట్ బాల్‌ను పర్యావరణానికి ఒక వరంగా మారుస్తున్నారు. ఇప్పటి వరకు ఈ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా 6 లక్షలకు పైగా మొక్కలను నాటడం విశేషం. కేవలం మొక్కలు నాటి వదిలేయడం కాకుండా అవి మహావృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షణ బాధ్యతలను టాటా గ్రూప్ పర్యవేక్షిస్తోంది.

### ఎక్కడ నాటుతున్నారు?

బీసీసీఐ కేవలం ఏదో ఒక ఖాళీ ప్రదేశంలో కాకుండా ప్రణాళికాబద్ధంగా ఈ ప్లాంటేషన్ చేపడుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ క్రికెట్ అకాడమీలు, శిక్షణ కేంద్రాలు, స్టేడియాల పరిసరాలు..ఎంపిక చేసిన నర్సరీలలో ఈ పచ్చదనం విస్తరిస్తోంది. ఇది భవిష్యత్ క్రీడాకారులకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే కాకుండా, క్రీడా మైదానాల చుట్టూ ఉండే వేడిని తగ్గించడానికి తోడ్పడుతుంది. క్రికెట్ కేవలం ఆట మాత్రమే కాదు..అది కోట్ల మందిని ప్రభావితం చేసే సాధనం. ఆ ప్రభావాన్ని పర్యావరణ మార్పు కోసం వాడటం అభినందనీయం.

### ప్రపంచానికే ఆదర్శం

ప్రపంచవ్యాప్తంగా ఎన్నో లీగ్‌లు బిగ్ బాష్, పీఎస్ఎల్, సీపీఎల్ జరుగుతున్నప్పటికీ పర్యావరణాన్ని క్రీడతో ఇంత వినూత్నంగా అనుసంధానం చేసిన తొలి బోర్డుగా బీసీసీఐ చరిత్ర సృష్టించింది. మైదానంలో పడే ప్రతి డాట్ బాల్ ఇప్పుడు అభిమానులకు కేవలం వికెట్ లేదా పరుగు నియంత్రణగా మాత్రమే కాకుండా పచ్చని భవిష్యత్తుకు వేస్తున్న పునాదిగా కనిపిస్తోంది. సిక్సర్ల మోతతో మార్మోగే ఐపీఎల్ స్టేడియంలలో ఒక బౌలర్ వేసే డాట్ బాల్ ప్రకృతి మాతకు ఊపిరిని ఇస్తోంది. బీసీసీఐ , టాటా గ్రూప్ సంయుక్తంగా సాగిస్తున్న ఈ 'గ్రీన్ మిషన్' క్రీడలు కేవలం వినోదానికే పరిమితం కాదని, అవి సామాజిక బాధ్యతను కూడా మోయగలవని నిరూపిస్తోంది. పచ్చని చెట్ల నీడలో రేపటి క్రికెట్ మరింత పరిమళించాలని ఆశిద్దాం.

# ఐపీఎల్.. రికార్డుల జోరు

## టీవీ, డిజిటల్ మీడియాలో ప్రభంజనం

- రోజు రోజుకీ పెరుగుతున్న వీక్షకుల సంఖ్య
- రోజు సరాసరి 28కోట్ల మందికి పైగా..
- టీవీ, డిజిటల్ మీడియాకు ప్రకటనలతో కాసుల వర్షం




భారతదేశంలో క్రికెట్ అంటే కేవలం ఒక క్రీడ మాత్రమే కాదు. అది ఒక భావోద్వేగం. దానికి గ్లామర్, వ్యాపారం, ఉత్కంఠ తోడైతే వచ్చేదే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్). తాజాగా ముగిసిన గణాంకాలను పరిశీలిస్తే, ఈ ఏడాది ఐపీఎల్ వ్యూయర్‌షిప్‌లో పాత రికార్డులన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. ప్రపంచంలోనే అత్యంత ధనిక, ప్రజాదరణ పొందిన లీగ్‌గా తన స్థానాన్ని ఐపీఎల్ మరోసారి సుస్థిరం చేసుకుంది. కేవలం స్టేడియాల్లోనే కాకుండా టెలివిజన్ సెట్లు, డిజిటల్ స్క్రీన్‌ల ముందు కోట్లాది మంది అభిమానులు వాలిపోతుండటమే ఇందుకు నిదర్శనం.



### గణాంకాల్లో ఐపీఎల్ ప్రభంజనం

స్టార్ స్పోర్ట్స్, అధికారిక బ్రాడ్‌కాస్టర్లు విడుదల చేసిన తాజా డేటా ప్రకారం, ఈ సీజన్ ప్రారంభం నుంచే ప్రేక్షకుల స్పందన అద్భుతంగా ఉంది. ఈ సీజన్ గణాంకాలను లోతుగా పరిశీలిస్తే ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తొలి 34 మ్యాచ్‌ల లైవ్ టీవీ రీచ్, తొలి 46 మ్యాచ్‌ల డిజిటల్ రీచ్‌ను పరిగణనలోకి తీసుకుంటే ఒక్కో మ్యాచ్‌కు సగటున 283 మిలియన్ల వ్యూయర్స్ నమోదయ్యారు. ఇది గత ఏడాదితో పోలిస్తే 5.5 శాతం వృద్ధిని సూచిస్తోంది.ఈ సీజన్ ఇప్పటివరకు ఏకంగా 1.04 బిలియన్ల మార్కును దాటి రికార్డు సృష్టించింది. గత సీజన్‌తో పోలిస్తే ఇది 7.4 శాతం అధికం. ఐపీఎల్ చరిత్రలో ఒక సీజన్ మధ్యలోనే ఈ స్థాయి రీచ్ రావడం ఇదే ప్రథమం.

### డిజిటల్ విప్లవం..

గ్రామీణ ఆదరణ ఒకప్పుడు క్రికెట్ అంటే కేవలం టీవీలకే పరిమితం అయ్యేది. కానీ ఇప్పుడు స్మార్ట్‌ఫోన్లు, హైస్పీడ్ ఇంటర్నెట్ , ఓటీటీ యాప్‌ల పుణ్యమా అని ఐపీఎల్ ప్రతి సామాన్యుడి చేతిలోకి వచ్చేసింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ స్ట్రీమింగ్ వినియోగం అనూహ్యంగా పెరిగింది. మెట్రో నగరాల్లో స్మార్ట్ టీవీల ద్వారా హైడెఫినిషన్ అనుభూతిని పొందుతున్న ప్రేక్షకుల సంఖ్య కూడా గణనీయంగా పెరగడం విశేషం. "ఐపీఎల్ కేవలం ఒక టోర్నమెంట్ కాదు.. ఇది భారతీయ వినోద రంగపు అతిపెద్ద పండుగ. డిజిటల్ ,టెలివిజన్ మాధ్యమాలు రెండూ ఒకదానికొకటి పోటీ పడుతూ వ్యూయర్‌షిప్‌ను కొత్త శిఖరాలకు చేరుస్తున్నాయి." అని మీడియా విశ్లేషకులు చెబుతున్నారు.

### వ్యూయర్‌షిప్ పెరగడానికి ...

ఈ భారీ సక్సెస్‌కు కేవలం క్రికెట్ మాత్రమే కాదు.. మరికొన్ని అంశాలు కూడా తోడయ్యాయి. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ వంటి దిగ్గజాలతో పాటు, ఈసారి యువ ఆటగాళ్లు మెరుపు దాడి చేయడం ప్రేక్షకులను ఆకట్టుకుంది. అభిషేక్ శర్మ, ప్రియాంశ ఆర్య, వైభవ్ సూర్యవంశీ వంటి కుర్రాళ్ల ప్రదర్శనలు లీగ్‌కు కొత్త ఊపునిచ్చాయి. ఈ సీజన్‌లో మెజారిటీ మ్యాచ్‌లు చివరి బంతి వరకు ఉత్కంఠగా సాగాయి. భారీ స్కోర్లు నమోదు కావడం, హైవోల్టేజ్ ఛేజింగ్‌లు ప్రేక్షకులను టీవీలకు కట్టిపడేస్తున్నాయి. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, ఎక్స్ మీమ్స్ , యూట్యూబ్ హైలైట్స్ ఐపీఎల్ క్రేజ్‌ను రెట్టింపు చేస్తున్నాయి. మైదానంలో జరిగే చిన్నపాటి చర్చలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఫ్యాన్ బేస్‌ను పెంచుతున్నాయి.

### వ్యాపార ప్రకటనల జోరు

రికార్డు స్థాయి వ్యూయర్‌షిప్ ఉండటంతో ప్రకటనదారులు ఐపీఎల్ వైపు క్యూ కడుతున్నారు. పది సెకన్ల అడ్వర్టైజ్‌మెంట్ కోసం కంపెనీలు కోట్లాది రూపాయలు వెచ్చించడానికి వెనకాడటం లేదు. ఎందుకంటే అతి తక్కువ సమయంలో దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు చేరువ కావడానికి ఐపీఎల్‌ను మించిన వేదిక మరొకటి లేదు. ఈకామర్స్ సంస్థల నుంచి స్టార్టప్స్ వరకు అన్ని ఐపీఎల్ స్లాట్స్ కోసం పోటీ పడుతున్నాయి. మొత్తానికి ఇండియన్ ప్రీమియర్ లీగ్ తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది. అటు క్రీడగా, ఇటు వ్యాపారంగా ఐపీఎల్ సృష్టిస్తున్న ప్రభంజనం భారత క్రీడా రంగానికి కొత్త దిశానిర్దేశం చేస్తోంది. రాబోయే ప్లేఆఫ్స్ , ఫైనల్ మ్యాచ్‌ల సమయానికి ఈ వ్యూయర్‌షిప్ రికార్డులు మరిన్ని శిఖరాలను అధిరోహించడం ఖాయంగా కనిపిస్తోంది.ఐపీఎల్ కేవలం క్రికెట్ లీగ్ మాత్రమే కాదు.. భారతీయుల జీవనశైలిలో ఒక భాగమని ఈ గణాంకాలు నిరూపిస్తున్నాయి.

# గంగ కత్వ కాలువ ఆధునీకరణ కు ప్రభుత్వం సమ్మతి



**సంగారెడ్డి వాస్తవ తెలంగాణ న్యూస్** జగ్గారెడ్డి కోరిక మేరకు రూ.42 కోట్ల విడుదలకు ప్రభుత్వం అంగీకారం.దశాబ్దాలుగా ఆధునీకరణ కు నోచుకోని నిజాం కాలం నాటి గంగ కత్వ కాలువ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆ శాఖ ఉన్నతాధికారుల తో సెక్రటేరియట్ లో సమావేశమైన జగ్గారెడ్డి.గంగ కత్వ ఆధునీకరణ పనులకు త్వరలో సీఎం రేవంత్ రెడ్డి తో శంఖుస్థాపన.సదాశివపేట మండలం సూరారం గ్రామం నుండి మొదలయ్యే నిజాం కాలం నాటి గంగ కత్వ కాలువ ఆధునీకరణ కు జగ్గారెడ్డి చొరవతో ఎట్టకేలకు మోక్షం లభించింది. నిజాం కాలం లో నిర్మించిన ఈ కాలువ ఇప్పటివరకు మరమ్మత్తు కు నోచుకోలేదు. దశాబ్దాల పాటు మరమ్మత్తుల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపుతున్న పనులకు మోక్షం కలుగలేదు. గంగ కత్వ ఆయకట్టు రైతులు , స్థానిక నేతల కోరిక మేరకు జగ్గారెడ్డి రెండు నెలల క్రితం నీటి పారుదల శాఖ అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆధునీకరణ పనుల కోసం వెంటనే కొత్త ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. కాలువ ఆధునీకరణ పనులకోసం నీటి పారుదల శాఖ అధికారులు రూ.42 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. ఆ ప్రతిపాదనలకు ప్రభుత్వం తాజాగా ఆమోదం తెలిపింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులతో సెక్రటేరియట్ లో జగ్గారెడ్డి సమావేశం అయ్యారు.

గంగకత్వ కాలువకు చేపట్టబోయే ఆధునీకరణ పనులపై ఈ సమావేశం లో చర్చించారు. గంగ కత్వ కాలువ సదాశివపేట మండలం సూరారం గ్రామం లో ప్రారంభం అయ్యి 11 గ్రామాలను కలుపుతూ సదాశివపేట మండలం లోని మాచిరెడ్డి పల్లి గ్రామం వరకు సుమారు 15 కిలో మీటర్ల పొడవునా విస్తరించి ఉంది. గంగకత్వ కాలువ కు 33 చెరువుల నుండి ఫీడర్ చానల్స్ ఉన్నాయి. ఆధునీకరణ పనుల్లో భాగంగా కాలువకు లైనింగ్ పనులు చేపడతారు. కాలువ పైన అవసరం ఉన్న చోట కొత్త బ్రిడ్జి ల నిర్మాణం, పాత వాటికి మరమ్మత్తు పనులు చేస్తారు. దీనితో పాటు కాలువ పొడవునా తుములకు రిపేర్లు చేస్తారు. ఈ కాలువ పనులు పూర్తయితే 3000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చు. సీఎం రేవంత్ రెడ్డి తో శంకుస్థాపన. సీఎం రేవంత్ రెడ్డి త్వరలో సంగారెడ్డి కి రానున్న నేపథ్యం లో గంగకత్వ పనులకు సైతం సీఎం తో శంకుస్థాపన చేయించేందుకు జగ్గారెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు త్వరత గతిన ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమక్షంలో జరిగిన సమావేశం లో అధికారులకు జగ్గారెడ్డి సూచించారు.

సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకట స్వామి చేతుల మీదుగా గంగ కత్వ పనులకు శంకుస్థాపన జరుగుతుందని జగ్గారెడ్డి అధికారులకు వివరించారు.

# రసాయన శాస్త్రంలో నమ్రతకు పీహెచ్.డీ



**పటాన్ చెరు వాస్తవ తెలంగాణ న్యూస్** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని ఇ. నమ్రత డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'గది ఉష్ణోగ్రత వద్ద విష వాయు సంవేదక అనువర్తనాల కోసం టైటానియం డయాక్సైడ్ (టిఓ2)-డోప్ చేసిన లోహ-కర్బన చట్రాలు (మీఓఫ్) ఉత్పన్నాలు, పోర్ఫిరిన్ ఆధారిత మీఓఫ్‌ల సంశ్లేషణ, లక్షణ నిర్ధారణ'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎం.ఎస్.సురేంద్ర బాబు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.డాక్టర్ నమ్రత చేసిన డాక్టరల్ పరిశోధనలో, సాధారణ పరిస్థితులలో ప్రమాదకర వాయువులను, ముఖ్యంగా అమ్మోనియాను గుర్తించడానికి ఒక వినూత్నమైన విధానాన్ని అందిస్తుందని తెలియజేశారు.పర్యావరణ భద్రత, ప్రజారోగ్యంపై దృష్టి సారిస్తూ, ఆమె తన పరిశోధనలో టైటానియం డయాక్సైడ్(టిఓ2)ను లోహ-కర్బన చట్రాలు (మీఓఫ్), ఫోర్ఫిరిన్ ఆధారిత నిర్మాణాలతో అనుసంధానించి అధునాతన సెన్సింగ్ పదార్థాలను అభివృద్ధి చేసినట్టు వివరించారు. ఈ నూతన మిశ్రమ పదార్థాలు సాంప్రదాయ పదార్థాలతో పోలిస్తే మెరుగైన సున్నితత్వం, ఎంపిక సామర్థ్యం, వేగవంతమైన ప్రతిస్పందన, దీర్ఘకాలిక స్థిరత్వాన్ని ప్రదర్శిస్తాయన్నారు.గది ఉష్ణోగ్రత వద్ద అమ్మోనియాను సమర్థవంతంగా గుర్తించడంలో జింక్-డోప్ చేసిన టైటానియం డయాక్సైడ్ / జింక్ ఆక్సైడ్ మిశ్రమం, పోర్ఫిరిన్ ఆధారిత హైబ్రిడ్ల యొక్క అద్భుతమైన పనితీరును ఈ అధ్యయనం ప్రస్ఫుటీకరించినట్టు తెలిపారు. ఇది వాస్తవ ప్రపంచ అనువర్తనాల కోసం తక్కువ ఖర్చుతో కూడిన, శక్తి సామర్థ్యం గల పరిష్కారాన్ని అందిస్తుందన్నారు.డాక్టర్ నమ్రత పరిశోధన, పర్యవేక్షణ, పారిశ్రామిక భద్రత, ఆరోగ్య సంరక్షణ నిర్ధారణ వంటి రంగాలలో ఉపయోగపడే అవకాశం ఉన్న తదుపరి తరం గ్యాస్ సెన్సార్ టెక్నాలజీలకు గణనీయంగా దోహదపడుతుందని తెలిపారు.డాక్టర్ నమ్రత సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరి పై ఎల్లప్పుడూ ఉండాల



**ఇంద్రధనస్సు దినపత్రిక మే 9 పటాన్ చెరు న్యూస్** పటాన్ చెరు నియోజకవర్గంలోని కొర్లకుంట గ్రామంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ చిత్తరమ్మ దేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపాలిటీ చైర్మన్ జనార్దన్ ముదిరాజ్ గారు, గ్రామ పెద్దలు, భక్తులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


# మోడీ సభను విజయవంతం చేయండి - ఎమ్మెల్సీ అంజిరెడ్డి,సంగారెడ్డి జిల్లా బిజేపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి





**పటాన్ చెరు వాస్తవ తెలంగాణ న్యూస్** ఈ నెల 10వ తేదీన తెలంగాణ రాష్ట్ర రాజధానిలో ప్రధాని నరేంద్ర మోదీ సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో భారీ బహిరంగ సభ విజయవంతం చేసేందుకు రామచంద్రపురంలో ఎమ్మెల్సీ అంజి రెడ్డి మరియు సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి స్వాగతం పలికారు సంగారెడ్డి జిల్లా నుంచి భారీగా జనసమీకరణ కోసం క్షేత్రస్థాయిలో వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టాం. కేవలం రాజకీయ ప్రచారంగా కాకుండా, ఒక ఇంటి శుభకార్యంలా ప్రతి ఇంటికీ వెళ్లాం. డప్పు చప్పులతో ఆడబిడ్డలకు, డాక్టర్స్, లాయర్స్, పెద్దలకు నుదుటన బొట్టు పెట్టి, ఎంట్రీ పాస్ లను ఇచ్చి సాదరంగా సభకు ఆహ్వానించడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా డివిజన్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 6వ వార్డులో బోరుబావి ఏర్పాటు



**గుమ్మడిదల వాస్తవ తెలంగాణ న్యూస్** ప్రజల నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో నూతన బోరుబావి ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. వార్డు కౌన్సిలర్ తుపాకుల రాధిక ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు మురళి, సంజీవరెడ్డి, కిషన్, నాయకులు తుపాకుల రాజు, గ్రామ నాయకులు యువకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

